సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 28 । నవంబర్ । 2023



కడపలో సినీతారల క్రికెట్ మ్యాచ్
కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా సినీతారల క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. డిసెంబర్, జనవరి మొదటి వారంలో మ్యాచ్ జరగనుంది. - 8లో



కారును ఢీ కొన్న లారీ
సంబేపల్లె మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం కారును గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఒకే కుటుంబంలోని ముగ్గురు గాయపడ్డారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 388 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	330	425
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 516.480 కిలోలు

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి కృషి

– జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి : జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ శ్రీలేఖలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువు లోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు.

కృష్ణమ్మకు జలహారతులు



హంద్రీ-నీవా కాలువలో పూజలు చేసి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మదనపల్లె : కరవునేలను సస్యశ్యామలం చేసే దిశగా కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. హంద్రీ-నీవా కాలువలోని కృష్ణాజలాలు తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి మదనపల్లె మండలానికి సోమవారం చేరుకున్నాయి. కదిరి నియోజకవర్గం చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి నవంబర్ 5న విడుదలైన కృష్ణాజలాలు పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లోని హంద్రీ-నీవా కాలువ గుండా ప్రవహిస్తూ మదనపల్లె మండలంలోకి ప్రవేశించాయి. మదనపల్లె నియోజవర్గం మీదుగా పుంగనూరు, అక్కడి నుంచి కుప్పం వరకు వెళ్లనున్నాయి. కొంతకాలంగా నీటిప్రవాహం ఎరుగని హంద్రీ-నీవా కాలువలో ఒక్కసారిగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుండటంతో స్థానిక ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ముఖ్యంగా మహిళలు, రైతులు కార్తీకపౌర్ణమి వేళ కృష్ణమ్మ తమ ప్రాంతాన్ని పావనం చేసేందుకు తరలివచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.అంకిశెట్టిపల్లె పంచాయతీలో సర్పంచ్ శరత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు కార్తీకదీపాలను వెలిగించి, హంద్రీనీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణమ్మకు జలహారతులతో స్వాగతం పలికారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్ : డిసెంబర్ 2వ తేదీన నిర్వహించే రీజినల్ జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్‌ఎస్‌డీసీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి కోరారు. రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ మేళాను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 100కు పైగా బహుళజాతి కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమతో పాటు ఆధార్‌కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు.

ప్రశాంతంగా స్టాఫ్‌నర్స్‌ల కౌన్సెలింగ్

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో సోమవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం మీటింగ్ హాల్‌లో నిర్వహించిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. రాయలసీమ వ్యాప్తంగా మొత్తం 95 పోస్టుల నియామకాలకు నిబంధనల ప్రకారం 95 మందిని ఎంపిక చేశారు. అందులో కౌన్సెలింగ్‌కు 61 మంది హాజరై నియామక పత్రాలను పొందారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి, డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంపు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, సప్లిమెంటరీ 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థులు చెల్లించే ఫీజు గడువును 28వ తేదీ వరకు పొడిగించినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి తెలిపారు. రూ.200 ఫైన్‌తో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. విద్యార్థుల నుంచి సేకరించిన ఫీజును ప్రిన్సిపాల్స్ డిసెంబర్ 1వ తేదీన బ్యాంకులో జమచేసి, సంబంధిత రసీదును పరీక్షల విభాగానికి సమర్పించాలన్నారు.

పోస్టర్లు విడుదల

కలసపాడు : స్థానిక పరిశుద్ధ పరిపేతురు పరిశుద్ధపౌలు చర్చి తిరునాల 136వ వార్షికోత్సవం డిసెంబర్ 2, 3వ తేదీల్లో నిర్వహించనున్నారు. సోమవారం దీనికి సంబంధించిన పోస్టర్లను బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పి.ఐజాక్‌వరప్రసాద్ విడుదల చేశారు.

కార్మికులపై కారుణ్యం

- మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్యకార్మికుల
- వేతనం రూ.21 వేలకు పెంపు
- మిగతా వారికి రూ.15వేలకు పెంపు
- జిల్లాలో 734 మందికి ప్రయోజనం

లబ్ధి కలిగిన ఉద్యోగుల సంఖ్య

మున్సిపాలిటీ	పారిశుధ్య కార్మికులు	ఇతరులు
మదనపల్లె	168	106
బి.కొత్తకోట	35	21
రాయచోటి	169	90
రాజంపేట	83	62



రాజంపేటలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

బి.కొత్తకోట : మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ప్రజారోగ్యశాఖలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందిపై వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కారుణ్యం చూపింది. వారి కష్టాన్ని గుర్తించి వేతనాలను పెంచి గౌరవించడమే కాక ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ నాటికి ఆర్థిక ప్రయోజనాలు పొందేలా నిర్ణయాన్ని అమలు చేయడంతో అన్నమయ్య జిల్లాలో 734 మందికి లబ్ధి కలిగింది. దీంతో వారి కుటుంబాల్లో సంతోషం నెలకొంది. ఉద్యోగ భద్రత దక్కిందని, ఏళ్ల తరబడి పారిశుధ్య పనులు చేస్తున్న తమపై ప్రభుత్వం కనికరం చూపిందని కార్మికులు కృతజ్ఞత వ్యక్తం చేస్తున్నారు.

గతంలో మధ్యవర్తి..

గత టీడీపీ పాలనలో నగర పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బంది వేతనాలు, వారి ఆరోగ్యం గురించి కనీసం పట్టించుకోలేదు. నగర పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి నెలకు రూ.10వేల వేతనం అందేది. మున్సిపాలిటీల్లో రూ.12వేలు చెల్లించే వారు. ఈ వేతనాల చెల్లింపు నేరుగా కార్మికులకు అందేవి కావు. కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తే..ఆ సంస్థ కార్మికులకు చెల్లించేది. దీంతో వేతనాల పెంపు, ఆరోగ్య సమస్యలపై ఇబ్బందులు పడేవారు. అంతేకాక పారిశుధ్య కార్మికుల లెక్కల్లో తేడాలుండేవి. తక్కువ సంఖ్యలో కార్మికులున్నా, ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్నట్టు వేతనాలు చెల్లించి స్వాహా చేసేవాళ్లు. కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండేదికాదు. కాంట్రాక్టు ఏజెన్సీలు, ఔట్‌సోర్సింగ్ సంస్థలపై భవిష్యత్తు ఆధారపడి ఉండేది.

ఇప్పుడు పటిష్టంగా..

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బంది జీవితాల్లో వెలుగులు నింపేలా ఆప్కాస్ (ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్స్‌డ్‌సర్వీసెస్)ను ఏర్పాటు చేశారు. పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి మధ్యలో కాంట్రాక్టు సంస్థ లేకుండా చేశారు. ఆప్కాస్‌ను ఏర్పాటుచేసి దాని పరిధిలోకి తీసుకొచ్చారు. కార్మికులకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్‌ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యలతో వీరికి ప్రతినెలా ఒకటోతేదినే వారి ఖాతాలకు వేతనాల సొమ్ము జమ అవుతోంది. రాష్ట్రంలో తొలుత ఆప్కాస్ ఉద్యోగుల వేతనాల చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యాకే ఇతరా ఉద్యోగుల వేతనాలను చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయాన్ని అమలు చేస్తోంది. గతంలో ఉద్యోగాలు ఉంటాయో ఊడుతాయో అన్న ఆందోళన ఉండేది. ప్రస్తుతం ఆప్కాస్ పరిధిలోకి తేవడంతో ఉద్యోగ భద్రత వచ్చింది.

జీవితాల్లో వెలుగు

పారిశుధ్య కార్మికుల వేతనం మున్సిపాలిటిల్లో రూ.12వేలు ఉండగా అదనంగా రూ.3వేలు పెంచారు. ఈ వేతనానికి ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్‌గా నెలకు రూ.6 వేలు ఇస్తూ నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్నారు. దీంతో ఒక్కో కార్మికునికి నెలకు రూ.21వేలు వారి ఖాతాలకే జమ చేస్తారు. సిబ్బందికి రూ.12వేల వేతనం ఉండగా రూ.3వేలు పెంచి రూ.15వేలు వేతనంగా ఈనెల ఒకటి నుంచి ప్రభుత్వం చెల్లిస్తోంది. పారిశుధ్య కార్మికులు 455 మంది, సిబ్బంది 279 మందికి ప్రయోజనం కలిగింది. తమ జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపి, ఉద్యోగ భద్రతకు భరోసా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.11వేలు పెరిగింది



బి.కొత్తకోట నగర పంచాయతీలో రూ.10వేల వేతనానికి పనిచేస్తున్నాం. రూ.1,200 వేతనం నుంచి కట్ అయ్యేది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దయతో ఒక్కసారిగా రూ.11వేలు పెరిగి రూ.21వేల జీతం వచ్చింది. ఇంత జీతం వస్తుందని అనుకోలేదు. మమ్మల్ని, మా కష్టాన్ని గుర్తించి ఆదుకున్న సీఎంకు కృతజ్ఞతలు.
– ఆదినారాయణ, పారిశుధ్య కార్మికుడు, బి.కొత్తకోట నగర పంచాయతీ

ఉద్యోగ భద్రత



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో మాకు ఉద్యోగ భద్రత కలిగింది. కాంట్రాక్టు ఏజెన్సీల దయాదాక్షిణ్యాలపై ఉద్యోగ భ్రధత ఆధారపడి ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా చేశారు. వేతనాలు పెంచి ఆప్కాస్ కింద గుర్తించారు. ఒకటో తేదినే పెంచిన వేతనాలు చెల్లించి మా జీవితాల్లో వెలుగులు నింపారు.
– మునుస్వామినాయక్, పారిశుధ్య కార్మికుడు, మదనపల్లె మున్సిపాలిటి

ప్రయోజనాలు వస్తాయి



మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి సాధారణ ఉద్యోగుల్లాగే ప్రయోజనాలు అందుతాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద కార్మికులు ఉద్యోగ భద్రతపై ఆందోళన తొలగింది. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా, వారసత్వ ఉద్యోగాలు, తదితర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.
– పీఆర్.మనోహర్, కమీషనర్, బి.కొత్తకోట

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సేంద్రియ పంటలను అంతర్జాతీయ బృందంతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలనలో భాగంగా లావోస్, భారత్, కెన్యా, జింబాబ్వే, సెనెగల్, ట్యునీషియా, పెరూ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు , పరిశోధకులు చిన్నమండెం సమీపంలో ఏపీసీఎన్ఎస్ ప్రాజెక్టు ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సిరాడ్, వరల్డ్ ఫిష్, అలయన్స్, బయోడైవర్సిటీ, ఓఈపీ, ఇనేరా సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. సేంద్రియ పంటలను అంతర్జాతీయ బృందంతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి , రసాయన వ్యవసాయాల మధ్య తేడాలను వివరించారు. జగనన్న ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌కు 80 నుంచి 90శాతం వరకు సబ్సిడీ అందిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంటల వాడకం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. రైతు సాధికారిక సంస్థ అధికారులు చంద్రశేఖర్, టీం లీడర్ ధర్మేంద్ర, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణమరాజు,అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ, వైస్ ఎంపీపీ ఏజాస్ అలీఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, షారుల్లా, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, బురాన్‌ఖాన్, అజ్రూ, నాగేశేషారెడ్డి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి



గాలివీడులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లాలో డిసెంబర్ 15 నుంచి చేపట్టనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను చేపట్టారని, ఇందుకు సంబంధించి జిల్లాలో నేటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో వలంటీర్లు రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. జిల్లాలోని 501 సచివాలయాల పరిధిలో డిసెంబర్ 15 నుంచి క్రీడల నిర్వహణకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. (డిసెంబర్ 15 నుంచి 2004 ఫిబ్రవరి 3వ తేదీ వరకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఐదు అంశాలలో క్రీడా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనడానికి 15 ఏళ్ల పైబడిన వారు గ్రామ లేదా వార్డు సచివాలయంలో వలంటీర్లు ద్వారా కానీ, ఆడుదాం. ఆంధ్రా. ఏపీ. జీఓవీ వెబ్‌సైట్ ద్వారా లేదా యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ ఉపకేంద్రాలు ప్రారంభం


అన్నమయ్య జిల్లా పరిధిలో నిర్మాణాలను పూర్తి చేసుకున్న 132/33 కేవీ విద్యుత్ రెండు ఉప కేంద్రాలను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం గాలివీడులో నూతనంగా ఏర్పాటు చేసిన 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. జిల్లాలోని గాలివీడులో రూ. 49 కోట్లు, టి సుండుపల్లెలో రూ. 41 కోట్లతో నూతనంగా నిర్మించిన 132/33 కేవీ ఉప కేంద్రాలను ఈనెల 28 వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేయనున్నారు. గాలివీడులో నిర్మించిన 132/33 కేవీ ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. .

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం :

గాలివీడు : రాయచోటి నియోజకవర్గ ప్రజలు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమనిఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి గాలివీడు మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్, సోలార్ ప్లాంట్ వర్చువల్ ద్వారా భూమిపూజ చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు.

వైభవం.. ఉరుసు ఉత్సవం





దర్గా ఆవరణలో భక్తుల సందడి (ఇన్‌సెట్) దర్గాలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కలెక్టర్ విజయరామరాజు, తదితరులు

కడప కల్చరల్ : పెద్దదర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు సోమవారం రెండోరోజు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, అధికారులు వన్‌టౌన్ సర్కిల్ నుంచి పూలచాదర్ సంప్రదాయంగా తీసుకుని వైవీ స్ట్రీట్ మీదుగా దర్గాకు ఊరేగింపుగా చేరుకున్నారు. అంతకుముందు దిశ పోలీసుస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్ ప్రసంగాల అనంతరం నిర్వాహకులు అతిథులకు పేటాలు అలంకరించారు. అట్టహాసంగా బ్యాండు మేళాల మధ్య అధికారులు చాదర్‌ను ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. అనంతరం పీఠాధిపతి ఆధ్వర్యంలో గురువుల మజార్‌పై చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫకీర్లు భక్తి గీతాలాపనలు చేశారు. తరువాత ముషాయిరా హాలులో జాతీయ స్థాయి ఖవ్వాలీ గాయకులు నిర్వహించిన కచేరీ భక్తులను ఉర్రూతలూగించింది. ఫకీర్ల విన్యాసాలు, బ్యాండు మేళాల మధ్యన దర్గా పీఠాధిపతి గంధం కలశాన్ని ఊరేగింపుగా వచ్చి దర్గాలోని గురువు మజార్ వద్ద సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా నిర్వహించారు.

పోటెత్తిన జనం

పెద్దదర్గా ఉరుసు ఉత్సవానికి భక్తజనం పోటెత్తారు పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. పీఠాధిపతిని కలిసి ఆశీస్సులు పొందారు.

• శంకరా.. శుభంకరా..



పుష్పగిరి కొండపై శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సందడి నెలకొంది. శివాలయాల ప్రాంగణాలు హరనామ స్మరణతో మార్మోగాయి.కార్తీక దీపారాధనతో ఆలయాలు కాంతులీనాయి.ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా పుష్పగిరిలో తెల్లవారు జామునుంచే భక్తులు పెన్నానదిలో స్నానాలు ఆచరించి కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ధ్వజ స్తంభం వద్ద , ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. భానుకోట సోమేశ్వర స్వామి క్షేత్రంలో ధ్వజస్తంభం శిఖరాగ్రంపై ఆకాశ దీపాన్ని వెలిగించారు. రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రీతికరమైన గుగ్గిల పూజలు నిర్వహించారు. పూజల్లో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా తరలి వచ్చారు. – సాక్షి నెట్ వర్క్



గుగ్గిల పూజలో భక్తజన సందోహం



గుగ్గిళ్లు మోసుకెళుతున్న అధికారులు, పాలక మండలి సభ్యులు

దశాబ్దాల కల సాకారం

- చిట్వేలి, రైల్వేకోడూరు రోడ్డు విస్తరణకు జీఓ జారీ
- రూ. 40 కోట్లతో పనులు
- ఫలించిన విప్ కొరముట్ల కృషి



రైల్వేకోడూరు-చిట్వేలి రోడ్డు మార్గం

ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు-చిట్వేలి మధ్య దాదాపు 26 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ప్రభుత్వం సోమవారం జీవఓ జారీ చేసింది. దీంతో రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల సాకారం కానుంది. ఇందుకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రభుత్వం ద్వారా రోడ్డు విస్తరణకు సంబంధించి జీవో తీసుకువచ్చారు. రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి విద్య, వాణిజ్యం కోసం ప్రతినిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. చిట్వేలి-రైల్వేకోడూరు మధ్య రహదారి వెడల్పు చిన్నదిగా ఉండటంతో ఎదురుగా వాహనం వస్తే పక్కకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ మార్గంలో ప్రమాదాలు సంభవించాయి. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 40 సంవత్సరాలుగా ఈ మార్గం విస్తరించాలని ప్రజలు, నాయకులు కోరుతున్నారు. నేటి వరకు వారి కల కలగానే మిగిలింది. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఎన్నికల ముందు, తర్వాత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే గ్రామాల నాయకులు, ప్రజలు చిట్వేలి-రైల్వేకోడూరు విస్తరణ పనులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జీఓ జారీచేయించారు. ప్రజల కలను నెరవేర్చారు. రోడ్డు విస్తరణ జరిగడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చు. అంతేకాకుండా రైల్వేకోడూరు నుంచి చిట్వేలి, పెనగలూరు, రాజంపేట, రాపూరు, నెల్లూరు విజయవాడకు వెళ్లేందుకు ఈ రోడ్డు ఉపయోగపడనుంది. కల సాకారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్చి నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు..



దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న చిట్వేలి-రైల్వేకోడూరు మార్గం రోడ్డు విస్తరణ పనులు 2024, మార్చి నెలకల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు రూ. 40 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం ద్వారా జీఓ తీసుకొచ్చాం. వెంటనే టెండర్లు పిలిచి పనుల వేగవంతానికి కృషి చేస్తున్నాం.
– ప్రభుత్వం విప్ కొరముట్ల శ్రీనివాసులు

కడప గడపలో సినీతారల క్రికెట్ మ్యాచ్

- డిసెంబర్ చివరి లేదా జనవరి మొదటివారంలో నిర్వహణ
- బాలీవుడ్, టాలీవుడ్ తారలతో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో సెలబ్రిటీ మ్యాచ్
- ఉచిత ప్రవేశం
- మైదానాన్ని పరిశీలించిన సినీ నటులు శ్రవణ్, ఖయ్యూం, మధునందన్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా సినీతారల క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. డిసెంబర్ చివరివారం లేదా జనవరి మొదటివారంలో టాలీవుడ్, బాలీవుడ్ నటులతో కూడిన క్రికెట్ జట్లు కడప నగరంలో క్రికెట్ మ్యాచ్ ఆడనున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానాన్ని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, ఏసీఏ సీఈఓ ఎం. వెంకటశివారెడ్డితో కలిసి ప్రముఖ సినీనటులు శ్రవణ్, ఖయ్యూం, మధునందన్, సీసీసీ చైర్మన్ షకీల్‌షఫీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా క్రికెట్ నెట్స్‌లో సినీనటులు కొద్దిసేపు ప్రాక్టీస్ చేసి సందడి చేశారు.


మాట్లాడుతున్న సీఏవైడీ జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి

ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో.. సినీతారల మెరుపులు..

కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో సినిమా తారలు విచ్చేసి క్రికెట్ మ్యాచ్ ఆడనున్నట్లు చారిటీ క్రికెట్ క్లబ్ (సీసీసీ) చైర్మన్ షకీల్ షఫీ పేర్కొన్నారు. స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే అంశాలపై చైతన్యం తీసుకువచ్చేందుకు చారిటీ మ్యాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా వరుసగా సినీతారలతో వివిధ ప్రాంతాల్లో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ యేడాది కడప వేదికగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో నిర్వహించే మ్యాచ్‌కు బాలీవుడ్ నటులు, టాలీవుడ్ నటులు హాజరవుతారని తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి మాట్లాడుతూ కడప వేదికగా రంజీ మ్యాచ్‌లు, జాతీయస్థాయి మ్యాచ్‌లు నిర్వహించామని, తొలిసారిగా సినీతారల క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్లడ్‌లైట్లను ప్రారంభించిన తర్వాత డిసెంబర్ చివరి లేదా జనవరి మొదటివారంలో మ్యాచ్‌ను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు, క్రికెట్ అభిమానులు మ్యాచ్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీఈఓ ఎం. వెంకటశివారెడ్డి మాట్లాడుతూ చారిటీ క్రికెట్ క్లబ్ పేరుతో 2011 నుంచి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీసీసీఐ, ఏసీఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలో క్రికెట్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సినీతారల క్రికెట్ మ్యాచ్ అలరిస్తుందన్నారు. ఈ మ్యాచ్‌కు ఎలాంటి రుసుం లేకుండా ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం సినీనటులను క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సీఏవైడీ ప్రతినిధులు ఎల్. మునికుమార్‌రెడ్డి, పృథ్వీ, పరిపాలనాధికారి శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయి స్టేడియంలా ఉంది..: ప్రముఖ విలన్ శ్రవణ్

కడప నగరంలో ఇంత చక్కటి క్రికెట్ స్టేడియం ఉంటుందని ఊహించలేదు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన స్టేడియం ఉండటం, ఈ మైదానంలో మాకు ఆడే అవకాశం రానుండటం సంతోషంగా ఉంది. సేవా కార్యక్రమాలకు మావంతు సహకారంగా మ్యాచ్‌లు ఆడనున్నాం.

అందరూ వీక్షించండి..: హాస్యనటుడు ఖయ్యూం

నేను క్రికెటర్‌గా దుబాయ్, సౌత్ ఆఫ్రికా, ఆస్ట్రేలియా తదితర దేశాలన్నింటినీ చూశాను.. ఆ తరహాలో కడపలో మైదానం ఉండటం మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇక్కడ మైదానం చూసిన తర్వాత 200 శాతం సంతోషంతో మ్యాచ్ ఆడేందుకు వస్తున్నాం. కడప ప్రజలు, క్రీడాభిమానులు విచ్చేసి వీక్షించండి.


బ్యాటింగ్ చేస్తున్న కమెడియన్ మధునందన్


బౌలింగ్ చేస్తున్న ప్రముఖ విలన్ శ్రవణ్

ఉన్నత ప్రమాణాలు కలిగిన మైదానం : హాస్యనటుడు మధునందన్

కడపలోని స్టేడియం అంతర్జాతీయ ప్రమాణాలతో చక్కగా ఉంది. ఇక్కడి పచ్చిక, పిచ్ చాలా బాగున్నాయి. ఇంత చక్కటి మైదానం ఉండటం మాకు ఆశ్చర్యం కలిగించింది. సినీతారల మ్యాచ్‌ను అందరూ వీక్షించాలని కోరుకుంటున్నాం.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యవస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సదరం సర్టిఫికెట్‌తో పెన్షన్ వస్తోంది



నేను పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్నా. వలంటీరు మా ఇంటి వద్దకు వచ్చి సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయించింది. సర్టిఫికెట్ రావడంతో మూడు నెలల నుంచి పింఛన్ వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి వద్దకే అన్ని సేవలు అందుతున్నాయి. మంచి చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని కోరుకుంటున్నా.

-సయ్యద్‌గౌస్‌పీర్, బాపనకాలువ, మదనపల్లె

పిల్లల చదువుకు భరోసా కల్పించింది



నా భర్త షేక్ కరీముల్లా దర్జీ వృత్తి చేస్తున్నారు. మా ఇద్దరు పిల్లలు చింతపర్తి మండల పరిషత్ ఉర్దూ పాఠశాలలో చదువుతున్నారు. మా భర్త దర్జీ పనుల ద్వారా వచ్చే అరకొర ఆదాయంతో మేము జీవనం సాగిస్తున్నాం. ఇలాంటి తరుణంలో పిల్లల చదువుల కోసం గతంలో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. 'అమ్మ ఒడి' కార్యక్రమాన్ని జగనన్న ప్రారంభించాక, మా పిల్లల చదువులకు భరోసా కలిగింది. పిల్లలను బాగా చదివించుకుంటున్నా. జనగన్న వెయ్యేళ్ల కాలం వర్ధిల్లాలి.

- షేక్ నసీమా, చింతపర్తి గ్రామం, వాల్మీకిపురం మండలం

సొంతింటి కల నెరవేరింది



గతంలో మేము అద్దె ఇంటిలో ఉండేవాళ్లం. అద్దె చెల్లించలేక నానా ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం రావడంతో ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం మంజూరైంది. సొంతింటి నిర్మాణం పూర్తి చేసుకుంటున్నాను.

- లక్ష్మీరంగా(చిన్ని), రామాపురం, రామాపురం మండలం

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

సెంట్రల్‌జోన్, నార్త్‌జోన్‌లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం మైదానాల్లో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ క్రికెట్ పోటీల్లో తొలిదశలో నిర్వహించిన రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడోరోజు సోమవారం 137 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 99.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్‌రెడ్డి 88 పరుగులు, తేజా 68 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు వాసు 3, గణేష్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులు చేయగా, నార్త్‌జోన్ జట్టు 272 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో మ్యాచ్ ఫలితం తేలకపోవడంతో డ్రాగా ముగియగా, నార్త్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.


81 పరుగులు చేసిన సెంట్రల్‌జోన్ జట్టు బ్యాట్స్‌మన్ వంశీకృష్ణ


88 పరుగులు చేసిన రెస్ట్ ఆఫ్ జోన్ బ్యాట్స్‌మన్ రేవంత్‌రెడ్డి


5 వికెట్లు తీసిన సౌత్‌జోన్ బౌలర్ ఆదిల్‌హుస్సేన్

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

36 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. జట్టులోని ఎం. వంశీకృష్ణ 81 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్ ఆదిల్‌హుస్సేన్ 5 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో సెంట్రల్‌జోన్ జట్టు 374 పరుగులు చేయగా, సౌత్‌జోన్ జట్టు 362 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, సెంట్రల్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

యువకుడి ఆత్మహత్య


ఉరివేసుకుని మృతి చెందిన రవికుమార్

తంబళ్లపల్లె : ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో జరిగింది. ములకలచెరువు సీఐ మధు, మృతుడి కుటుంబీకుల కథనం మేరకు వివరాలు.. పరసతోపు పంచాయతీ ఏటిగడ్డకు చెందిన వి.పాపులమ్మ కుమారుడు వి.రవికుమార్(24), ఆదివారం రాత్రి ములకలచెరువు రోడ్డు పక్కన గుట్టలోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. సోమవారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ మధు, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ విలేకరులకు తెలిపారు.

సమస్యల పరిష్కారంతో ప్రజలకు మరింత చేరువ


బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా అందుతున్న ఫిర్యాదుల పట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం సత్వరం స్పందించి వాటికి పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి వారితో చర్చించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 55 ఫిర్యాదులను ఎస్పీకి అందించారు. ప్రజల ఫిర్యాదులను విచారించి వాటిపై ఆయా ప్రాంతాల పోలీస్ డివిజనల్, సర్కిల్ స్థాయి అధికారులతో వీడియో, టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి చట్టపరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ సూచించారు.

కారును ఢీ కొన్న గుర్తు తెలియని లారీ




ప్రమాదంలో గాయపడిన రూప, నితిన్, అనిత

సంబేపల్లి : సంబేపల్లె మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు జమ్మలమడుగు టౌన్‌కు చెందిన మహేంద్ర నాగోజీరావు సతీమణి రూప, కుమారుడు నితిన్, కుమార్తె అనితలు తమిళనాడులోని అరుణాచలానికి కారులో వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని గంగా హోటల్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రాయచోటి వైపు నుంచి వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రూప, నితిన్, అనితలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనం సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సంబేపల్లె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని చెరువు కట్టపై సోమవారం కారును లారీ ఢీ కొనడంతో ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వేంపల్లికి చెందిన రాజేశ్వరి (30), ఆమె కుమారుడు శశాంక్ తి(05)తో కలిసి కువైట్ నుంచి చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వారిని చెన్నై నుంచి ఆమె తండ్రి లక్ష్మయ్య కారులో తీసుకువస్తుండగా ఒంటిమిట చెరువు కట్టపైకి రాగానే కడప నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని డ్రైవర్ సతీష్ కుమార్(45), తండ్రి లక్ష్మయ్య(55)లకు రక్తగాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరిలో రాజేశ్వరికి స్వల్ప గాయం కాగా, ఆమె కుమారుడు శశాంక్ సురక్షితంగా ఉన్నాడు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 సహాయంతో కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో దెబ్బతిన్న వాహనాలను తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని లింగాలకుంట సమీపంలో కడప–బద్వేలు ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బద్వేలు పట్టణం శ్రీకృష్ణ దేవరాయ నగర్‌కు చెందిన షణ్ముఖ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు షణ్ముఖ కడప వైపు నుంచి బద్వేలుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బద్వేలు డిపోకు చెందిన ఏపీ04జెడ్0066 నంబరు గల ఆర్టీసీ బస్సు కడపకు వెళుతూ లింగాలకుంట సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గాయపడిన యువకుడిని 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే గాయపడిన వ్యక్తి హెల్మెట్ ధరించి ఉండడంతో కొంతమేర ప్రమాదం తప్పిందని లేకుంటే అక్కడే మృత్యువాత పడేవాడని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

అట్లూరు : జి.కొత్తపల్లె సమీపంలో 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కె.సి.రాజు తెలిపారు. జి.కొత్తపల్లె ఎస్టీకాలనీకి చెందిన ఉదయగిరి నిత్యపూజయ్య, సిద్దవటం మండలం పొన్నవోలు కొత్తపల్లెకు చెందిన పెరుగు లక్ష్మీనరసయ్యలు ఎర్రచందనం అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్నటు సమాచారం అందిందన్నారు. దాడి నిర్వహించి దుంగలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశామన్నారు.

30న జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 30వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. చిన్నపరెడ్డి, కార్యదర్శి సింధూరి తెలిపారు. 2008 జనవరి 1 తర్వాత పుట్టినవారు ఎంపికలకు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయో ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, స్టడీసర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు.

అధికారులను విచారించిన జడ్జి

నందలూరు (రాజంపేట) : మండలంలోని అడపూరు వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలకు సంబంధించిన సమస్యలపై అధికారులను జడ్జి లత విచారించారు. పీఎల్‌సీ నంబరు. 54/2023 కేసు విషయమై నందలూరు జూనియర్ సివిల్ జడ్జి లత నోటీసులు జారీ చేయగా సోమవారం జరిగిన విచారణకు ఆ పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ సుకన్య, అన్నమయ్య జిల్లా డీఎంహెచ్‌ఓ కొండయ్య, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. కళాశాలలో విద్యార్థుల సమస్యలు, వారి ఆరోగ్య పరిస్థితి గురించి వార్తా పత్రికలలో వచ్చిన కథనాలపై విచారించారు. డిసెంబర్ 4వ తేదీన జరిగే వాయిదాలో వీటికి సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలు, కల్పించిన సౌకర్యాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అధికారులను జడ్జి లత హెచ్చరించారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం


హాజరైన భక్తులు


మంగళ సూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకుడు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతా సమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి, నూతన పట్టువస్త్రాలు ధరింపజేశారు. తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.